సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం ❘ 16 ❘ ఫిబ్రవరి ❘ 2023



'నవమి' పనులకు టెండర్లు
శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల పనులకు రూ.1.35 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. 10లో



న్యాక్ బృందం సందర్శన
ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం సభ్యులు సందర్శించి విభాగాల వారీగా సమీక్షలు నిర్వహించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
37° / 18°

వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు భారీగానే నమోదవుతాయి. రాత్రి వాతావరణం చల్లగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



కొత్తగూడెంలో ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న సులోచనారాణి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 27 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు జనరల్ విద్యార్థులు 975 మందికి 877 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1399 మందికి 1190 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు జనరల్, ఒకేషనల్ కలిపి 1924 మంది విద్యార్థులకు గాను 1706 మంది హాజరు కాగా, 218 మంది గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి సులోచనారాణి పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు.

నేడు జిల్లా స్థాయి మహిళా చెస్ చాంపియన్‌షిప్

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆదేశాల మేరకు గురువారం జిల్లా స్థాయి మహిళా చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి టి.సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని మహిళలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు నేడు కొత్తగూడెం సింగరేణి హైస్కూల్‌లో నిర్వహిస్తున్నామని, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు 17న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల మహిళా చెస్ క్రీడాకారులు నేరుగా సింగరేణి హైస్కూల్‌కు రావాలని, వివరాలకు 9505423226 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ

సుజాతనగర్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి చరమగీతం పాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు 'ప్రజా గోస – బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా రాఘవాపురంలో బుధవారం కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల నాగేశ్వరావు, కోనేరు నాగేశ్వరావు, నరేంద్రబాబు, వెంకటేష్, సురేష్, రాము, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా తనిఖీ

చుంచుపల్లి: కొత్తగూడెంలోని బూడిదగడ్డలోని బస్తీ దవాఖానాను డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష బుధవారం తనిఖీ చేశారు. వైద్యసేవలు, ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. దవాఖానాలో అన్ని రకాల రక్త పరీక్షలకు శాంపిళ్లు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మణికంఠారెడ్డి, డాక్టర్ వాస్తవ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫలంతో ఫలితం !



జిల్లాలో సాగు చేస్తున్న పనస, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్, అరటి తోటలు..

పెరుగుతున్న పండ్ల తోటల విస్తీర్ణం

- డిమాండ్‌కు అనుగుణంగా సాగు
- జిల్లాలో 26,276 ఎకరాల్లో పండ్ల తోటలు
- అంతర పంటలుగా కూడా అవకాశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ పండ్లతోటల పెంపకం గణనీయంగా పెరిగింది. గత ఆరేళ్లలో 18వేల ఎకరాలకు పైగా ఈ సాగు పెరగడం విశేషం. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో, పునర్విభజన జరిగిన తర్వాత జిల్లా పరిధిలో ప్రతి సంవత్సరం 1000 ఎకరాల చొప్పున, గత ఏడాది కాలంగా అంతకుమించి భారీగా పండ్ల తోటల సాగు పెరుగుతూ వస్తోంది. ప్రధానంగా మామిడి, జీడిమామిడి, పనస, నిమ్మ, నేరేడు, జామ, బొప్పాయి, సీతాఫలం పంటల సాగు అధికంగా ఉంటోంది. ఇటీవల డ్రాగన్ ఫ్రూట్ విస్తీర్ణం కూడా పెరుగుతోంది. ఈ పంటలతో రైతులు ఆర్థికంగా కూడా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పండ్ల తోటల మధ్య అంతర పంటల సాగుకు కూడా అవకాశం ఉండడంతో రైతులు ఇటు వైపు దృష్టి సారిస్తున్నారు. మామిడి తోటల మధ్యలో బొప్పాయి, జామ, సరిహద్దుల చుట్టూ పనస, నేరేడు, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్ పండించే అవకాశం ఉందని ఉద్యాన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పండ్లతోనే రోగ నిరోధక శక్తి..

కరోనా, ఆ తర్వాత కాలంలో ప్రజలు ఆరోగ్యంపై మరింతగా శ్రద్ధ పెడుతున్నారు. వివిధ రకాల పండ్లు తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు సూచిస్తుండడంతో ప్రతి ఒక్కరూ ఖర్చుకు వెనుకాడకుండా పండ్లు కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ మంది రాత్రిపూట పండ్లను మాత్రమే ఆహారంగా తీసుకుంటున్నారు. దీంతో మార్కెట్‌లో పండ్లకు డిమాండ్ పెరిగింది. అందుకు తగ్గట్టుగా దిగుబడి సాధించేందుకు ఉద్యాన అధికారులు రైతులను చైతన్యం చేస్తున్నారు. పండ్ల తోటల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చంటూ అవగాహన పెంచుతున్నారు. ఈ క్రమంలో రైతులు సైతం పండ్ల తోటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. పండ్లతోటలు సాగు చేసే రైతులకు బిందుసేద్యం, డ్రిప్, ఎరువులపై సబ్సిడీ ఇస్తున్నారు. ఎరువుల వాడకం, వేప ఆధారిత మందులు, సేంద్రియ పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువులు, వర్మి కంపోస్టు, పశువుల ఎరువు, వేపపిండి, ఆముదం పిండి వాడకం తదితర విషయాలపై అవగాహన పెంచడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. ఇక లాభదాయకమైన పంటగా పేరున్న డ్రాగన్‌ఫ్రూట్ కూడా పలు ప్రాంతాలకు విస్తరించింది. 2018 –19లో టేకులపల్లిలో ప్రారంభమైన ఈ పంట సాగు అన్నపురెడ్డిపల్లి, పినపాక, దమ్మపేట, బూర్గంపాడు, సుజాతనగర్ తదితర మండలాలకూ విస్తరించింది. ఈ తోటల మధ్య పుచ్చ, కర్బూజా, పూలు, ఆకుకూరలు తదితర పంటలు కూడా సాగు చేస్తున్నారు.

జిల్లాలో గత తొమ్మిదేళ్లుగా పండ్ల తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వివరాలిలా(ఎకరాల్లో)..

సంవత్సరం	విస్తీర్ణం
2014కు ముందు	4,368
2014 – 15	5,744
2015 – 16	7,163
2016 – 17	8,426
2017 – 18	9, 944
2018 – 19	11, 157
2019 – 20	12, 293
2020 – 21	13, 607
2021 – 22	14, 694
2022 – 23	26, 276

డిమాండ్ బాగుంది



బొప్పాయికి డిమాండ్ ఉందని ఆ పంట సాగు చేస్తున్నాం. ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. పండ్ల తోటలను ఇలాగే కొనసాగిస్తాం. అధికారుల సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడుతున్నాం.

– యెర్రం లక్ష్మారెడ్డి, లక్ష్మీపురం, బూర్గంపాడు మండలం

లాభదాయకంగా ఉంది



మార్కెట్‌లో అరటి పండ్లకు డిమాండ్ బాగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలు రాకుంటే ఈ పంట ఎంతో లాభదాయకంగా ఉంటుంది. ఆర్థికంగా ఎదగానికి అవకాశం ఉన్న పంట. ఇప్పటివరకైతే మాకు సంతృప్తిగానే ఉంది.

– సయ్యద్ బాజి, దమ్మపేట

పనసతో సంతృప్తి



సంప్రదాయ పంటల వల్ల లాభనష్టాలు సమానంగా ఉంటాయి. కానీ పండ్ల తోటల వల్ల లాభాలే ఎక్కువగా ఉంటాయి. నేను ప్రస్తుతం సాగు చేస్తున్న పనసతో సంతృప్తిగా ఉంది. అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేస్తున్నాం.

– గొట్టిపాటి వెంకటేశ్వరరావు, హేమచంద్రాపురం

సత్ఫలితాలు వస్తున్నాయి



ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపి రైతులు ఆర్థికంగా ఎదగాలని మేం చేస్తున్న కృషి సత్ఫలితాలిస్తోంది. జిల్లాలో క్రమంగా పండ్ల తోటల విస్తీర్ణం పెరుగుతోంది. ఇంకా పెంచడానికి చర్యలు చేపడుతున్నాం. ఆ దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన అధికారి

పనుల్లో జాప్యం ఎందుకు ?

సమీకృత మార్కెట్ల నిర్మాణాల ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమీకృత మార్కెట్ల నిర్మాణం సగం వరకు కాదు.. వంద శాతం పనులు పూర్తి చేయాలి.. ఎందుకు జాప్యం చేస్తున్నారు.. భయం లేదు.. చలనమూ లేదు అని కలెక్టర్ అనుదీప్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐడీఓసీ మినీ సమావేశ మందిరంలో బుధవారం పట్టణ ప్రగతి కార్యక్రమాలపై మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, ప్రజారోగ్య శాఖ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలల తరబడి తాత్సారం ఎందుకు చేస్తున్నారని పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. కాంట్రాక్టర్లతో పనులు చేయించుకోవాల్సిన బాధ్యత కమిషనర్లదేనని అన్నారు. రెండు వారాలుగా పనులు జరగడం లేదని కారణాలు చెప్పొద్దని, సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైకుంఠధామాల్లో రహదారి, విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు ఉండాలని అన్నారు. మార్చి 5 నాటికి ఇల్లెందు మున్సిపాలిటీలో ఎఫ్‌ఎస్‌టీపీలో గ్రీనరీ, మిషనరీ ఏర్పాటు కావాలని స్పష్టం చేశారు. మణుగూరు, కొత్తగూడెంలో ఎఫ్‌ఎస్‌టీపీ పనులు ప్రారంభించాలన్నారు. కొత్తగూడెం, ఇల్లెందులలో బస్తీ దవాఖానాలను ఈ నెలాఖరుకు ప్రారంభించాలని, సిబ్బంది కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరు కంటి పరీక్షలు నిర్వహించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగూడెంలో 15, ఇల్లెందులో 10, మణుగూరులో 10, పాల్వంచలో 5 క్రీడా ప్రాంగణాలను 15 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో నర్సరీల్లో మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, పాల్వంచ ప్రత్యేక అధికారి డాక్టర్ పురంధర్, పాల్వంచ, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్లు శ్రీకాంత్, అంకుషావలి, కొత్తగూడెం తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఫెయిలైతే .. టీచర్లూ ఫెయిలైనట్టే..

పరీక్షల్లో విద్యార్థులు ఫెయిల్ అయితే టీచర్ కూడా ఫెయిల్ అయినట్లుగానే పరిగణించాలని కలెక్టర్ అనుదీప్ వ్యాఖ్యానించారు. పదో తరగతి పరీక్షలు, యూడైస్ ప్లస్, ఆధార్ నమోదు, మన ఊరు మన బడి కార్యక్రమాలపై బుధవారం ఆయన సమీక్షించారు. పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. గత సంవత్సర ఫలితాలను బేరీజు వేసుకుని పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి 13 వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 334 పాఠశాలలకు చెందిన 6,074 మంది బాలురు, 6,416 మంది బాలికలు మొత్తం 12,490 మంది పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. విద్యార్థుల అల్పాహారానికి రూ. 20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం 80 శాతం ఫలితాలు సాధించామని, ఈసారి వంద శాతం సాధించాలని కోరారు. గతేడాది 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో గత సంవత్సరం ఫలితాల్లో జిల్లా 29వ స్థానంలో నిలిచిందని, ఈసారి మెరుగైన స్థానం సాధించాలని ఆకాంక్షించారు. సమావేశంలో డీఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఎస్‌పీఎల్ రీజినల్ టోర్నీ



ఎస్‌పీఎల్ టోర్నీ బహుమతి ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జావేద్ పాషా, సాక్షి ఉద్యోగులు -8లో...

ఏకగ్రీవాలకు ఎగనామమేనా?



పాలకవర్గం ఏకగ్రీవమైన చర్ల మండలం బోధనెల్లి పంచాయతీ

- యునానిమస్ పంచాయతీలకు అందని ప్రోత్సాహకాలు
- నాలుగేళ్లయినా ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో ఎదురుచూస్తున్న 43 గ్రామ పంచాయతీలు

చుంచుపల్లి: గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకుంటే వాటి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఏకగ్రీవ పంచాయతీల ఎంపిక జరిగి నాలుగేళ్లయినా నగదు నజరానాల ఊసే ఎత్తడం లేదు. దీంతో ఆయా పంచాయతీల పాలక వర్గాలు తీవ్ర నిరాశలో ఉన్నాయి. ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి ఇంకో ఏడాది మాత్రమే ఉంది. దీంతో ప్రోత్సాహకాల విషయంలో ప్రభుత్వం దాదాపు మొండి చెయ్యి చూపించినట్లే కనిపిస్తోంది. ఈ నిధుల కోసం నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్న పంచాయతీల సర్పంచుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2019 గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే నగదు మరింతగా పెంచుతామని ప్రకటించింది. ఈ ప్రోత్సాహంతో గ్రామాలు ప్రగతిబాట పడతాయనే ఆశతో జిల్లాలోని పలు పంచాయతీలు ఏకగ్రీవాలకే మొగ్గు చూపాయి. జిల్లాలోని 481 పంచాయతీలకు గాను 479 జీపీలకు ఎన్నికలు నిర్వహించేందుకు నాడు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో 43 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, అధికంగా కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలే ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే నగదుతో ఈ పంచాయతీలకు కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని పాలకవర్గాలు భావిస్తున్నాయి. ఆలస్యమైనా నగదు ప్రోత్సాహకాలు వస్తాయనే ఆశతో సర్పంచ్‌లు ఎదురుచూస్తున్నారు. అయితే జనవరి 12న జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్.. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వారం, పది రోజుల్లో ఆ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి పంచాయతీకి ప్రత్యేక నిధులు ఇచ్చిన నేపథ్యంలో ఇక ఏకగ్రీవాలకు మళ్లీ నగదు ప్రోత్సాహకాలు లేనట్టేనని తెలుస్తోంది.

రూ.15 లక్షలు హామీ ఇచ్చిన ప్రభుత్వం..

2019లో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే రూ.7 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీనికి అదనంగా ఎమ్మెల్యేల నిధుల నుంచి మరో రూ.5 లక్షలు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. జిల్లాలో 43 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వాటిలో అశ్వాపురం మండలంలో ఒకటి, చర్ల మండలంలో మూడు, దుమ్ముగూడెంలో ఐదు, మణుగూరులో ఒకటి, ములకలపల్లిలో రెండు, పాల్వంచలో ఐదు, చంద్రుగొండలో రెండు, దమ్మపేటలో ఎనిమిది, అశ్వారావుపేటలో రెండు, పినపాకలో మూడు, కరకగూడెంలో రెండు, ఆళ్లపల్లిలో రెండు, గుండాలలో ఒకటి, టేకులపల్లిలో నాలుగు, లక్ష్మీదేవిపల్లి మండలంలో రెండు పంచాయతీలు ఉన్నాయి.

ప్రభుత్వ పరిధిలో ఉంది



ఏకగ్రీవ పంచాయతీలకు సంబంధించిన విషయం ప్రభుత్వం పరిధిలో ఉంది. జిల్లాలో 43 ఏకగ్రీవ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక ఇటీవల సీఎం ప్రత్యేక నిధుల నుంచి ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షలు మంజూరు చేశారు. వాటికి సంబంధించి పనుల ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

– రమాకాంత్, డీపీఓ

'పది' విద్యార్థులకు అల్పాహారం



మేదరబస్తీ పాఠశాలలో అల్పాహారంతో విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని 110 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 4,058 మంది పదో తరగతి విద్యార్థులు ఉండగా వారందరికీ ఉదయం , సాయంత్ర వేళల్లో స్పెషల్ క్లాసుల సమయంలో బుధవారం నుంచి అల్పాహారం అందిస్తున్న విషయం తెలిసిందే. అల్పాహారంతో విద్యార్థులకు ఆకలి సమస్య తీరి, శ్రద్ధగా పాఠాలు వినేందుకు దోహదపడుతుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ప్రతీ సందర్భంలో అండగా ప్రజలు

- వైరాతో నాకు అవినాభావ సంబంధం
- ఇక్కడికి రాకున్నా సమయానికి వస్తారనే నమ్మకముంది
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, నాయకులు విజయాబాయి, స్వర్ణకుమారి తదితరులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వైరా నియోజకవర్గంతో తనకు అవినాభావ సంబంధం ఉందని, 2013 ఫిబ్రవరిలో తాను రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పటి నుంచి ప్రతీ సందర్భంలో ఇక్కడి ప్రజలు అండగా నిలుస్తున్నారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైరాలో బుధవారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ అధ్యక్షత వహించగా పొంగులేటి మాట్లాడారు. 2014లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలు, ఆ తర్వాత ఏ ఎన్నికలొచ్చినా వైరా ప్రజలు అండగా నిలిచారని గుర్తు చేశారు. తాను కష్టంలో ఉన్నానంటే ప్రజలు వెన్నంటి నడుస్తుండడంతో ఇబ్బందులను చిరునవ్వుతో ఎదుర్కొంటున్నానని చెప్పారు. తాను ఒంటరినని అనుకుంటూ కొందరు రాక్షసానందం పొందుతున్నారని, తానొక్కడిని కాదు వేలాది మంది వెంట ఉన్నారని చెప్పేందుకే ఇక్కడికి వచ్చానని తెలిపారు. తాను ఏ పార్టీలోకి వెళ్తున్నానని కూడా చూడకుండా ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని పొంగులేటి చెప్పారు. సాయంత్రమయ్యాక ఏ గూటి పక్షులు ఆ గూటికి చేరినట్లే ఈ సమ్మేళనానికి రాని వారు సమయం వచ్చినప్పుడు తన దరికి చేరుతారని తెలిపారు.

మేకపోతు గాంభీర్యాలు..

కరెంట్ లేక రైతులు ధర్నాలు, ఆందోళనలు చేస్తుంటే ఏమీ జరగనట్లుగా మేకపోతు గాంభీర్యాలు, వ్యక్తిగత విమర్శలు తప్ప నిజాలను ఒప్పుకోకపోవడం దురదృష్టకరమని బీఆర్‌ఎస్ నేతలనుద్దేశించి పొంగులేటి విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో బిడ్డలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూస్తున్నామని చెప్పారు. వేదికపై ఉన్న నాయకులతోపాటు వేదిక ముందు ఉన్న కుటుంబ సభ్యులంతా ఇచ్చిన భరోసా, ధైర్యం, శక్తి చిన్నది కాదని పేర్కొన్నారు. యావత్ తెలంగాణ ఖమ్మం జిల్లా వైపు.. శ్రీనివాసరెడ్డి వైపు చూస్తోందంటే అభిమానుల బలమే కారణమని తెలిపారు. అనంతరం వైరా అభ్యర్థిగా ప్రకటించిన బానోతు విజయాబాయి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రజలంతా శ్రీనివాసరెడ్డి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రతీ ఇంట్లో ఆయన ఫొటో ఉందని, నిజాయితీగా పొంగులేటి వెంట నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతానని చెప్పారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ మాట్లాడుతూ ఎంపీగా పొంగులేటి ఉమ్మడి జిల్లాపై చెరగని ముద్ర వేశారని తెలిపారు. అలాంటి వ్యక్తి ప్రజల్లో తిరగడాన్ని, ప్రజలను ఆదుకోవడాన్ని నేరంగా చూస్తున్నారని పేర్కొన్నారు. పదవులు తమకు శాశ్వతం కాదని, ఏం జరిగినా పొంగులేటికి వెన్నుదన్నుగా ఉంటామని స్పష్టం చేశారు. తొలుత సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంకా ఈ సమ్మేళనంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, మున్సిపల్ కౌన్సిలర్లు వణితి ఉష, కన్నెగంటి సునీత, గుగులోతు లక్ష్మీబాయి, నాయకులు, ప్రజాప్రతినిధులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, మిట్టపల్లి నాగి, కొంగర జ్యోతిర్మయి, లేళ్ల వెంకటరెడ్డి, దార్న రాజశేఖర్, గుమ్మా రోశయ్య, రాయల పుల్లయ్య, ఇమ్మడి తిరుపతిరావు, స్వర్ణ ప్రహ్లాదరావు, గుండ్ల కోటేశ్వరరావు, ఇటికల మురళి, చింతనిప్పు సుధాకర్, పరికపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు

జూలూరుపాడు: వైరాలో బుధవారం జరిగిన నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనానికి సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పొంగులేటి అనుచరులు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. మండల కేంద్రంలో బాణాసంచా కాల్చుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు, సొసైటీ డైరెక్టర్లు కళ్యాణపు నరేష్, భూక్యా జవహర్‌లాల్, దాసరి నాగయ్య, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, ధరావత్ రాంబాబు, లేళ్ల గోపాల్ రెడ్డి, నర్వనేని పుల్లారావు, మద్దెబోయిన నరేష్, దుద్దుకూరి నరసింహారావు, పోతురాజు నాగరాజు, అజ్మీర రాంబాబు, భూక్యా నరసింహారావు, భూక్యా అమృ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న సిబ్బంది

పాల్వంచ: పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ డీడీఓ ఎం డీ.ఫయాజ్‌మెయినుద్దీన్ ఆధ్వర్యంలో స్కానింగ్ కేంద్రాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. లింగ నిర్ధారణ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ సీతారాంపురం కాలనీ గ్రామంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన సప్కా పెద వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పనులకు వెళ్లాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించి పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో ఫైర్ ఇంజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. ఈ లోపే పూరిల్లు పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సామగ్రి, బియ్యం, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి వేణుప్రియ సంఘటనా స్థలాన్ని సందర్శించి, నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. బాధిత కుటుంబానికి రేగా విష్ణు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సతీమణి సుధారాణి సర్పంచ్‌లు, స్థానిక నాయకులతో కలిసి రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. 50 కేజీల బియ్యం అందజేశారు.

వార్డు సభ్యురాలి తొలగింపు

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో పదో వార్డు సభ్యురాలు యాకూబీని పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ అనుదీప్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీఓ చిరంజీవి వివరాలు వెల్లడించారు. బాలాజీనగర్ గ్రామపంచాయతీలో ఉప సర్పంచ్‌గా కొనసాగుతున్న యాకూబీ ముగ్గురు సంతానం కలిగి ఉన్నారని, ఆమె వార్డు సభ్యురాలిగా కొనసాగేందుకు అనర్హురాలని వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని చెప్పారు. విచారణ నిర్వహించిన కలెక్టర్ ఫిర్యాదుదారుల ఆరోపణ రుజువు కావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆమె వార్డు సభ్యురాలి పదవితోపాటు ఉపసర్పంచ్ పదవిని కూడా కోల్పోయినట్లు పేర్కొన్నారు.

డీసీసీబీ ఆధ్వర్యాన రుణగ్రహీతల ఇళ్ల జప్తు




కొత్తకొత్తూరులో సామగ్రిని జప్తు చేస్తున్న డీసీసీబీ ఉద్యోగులు

నేలకొండపల్లి: డీసీసీబీ నుంచి 2016–17లో జేఎల్‌జీ రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించకపోవడంతో ఆస్తుల జప్తునకు అధికారులు ఉపక్రమించారు. నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఐదుగురు చొప్పున కమిటీలకు రూ.5 వేల చొప్పున వడ్డీ లేని రుణాలు దాదాపు రూ.70 లక్షలు ఇచ్చారు. అయితే, వీటిని సకాలంలో చెల్లించకపోవడంతో పలు మార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేనందున బుధవారం ఆస్తుల జప్తునకు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా తిరుమలాపురం, కొత్తకొత్తూరులో డీసీసీబీ అధికారులు పర్యటిస్తూ పలువురి ఇళ్లు, సామగ్రిని సీజ్ చేశారు.

మద్యం మత్తులో యువకుల దాడి

కొత్తగూడెంఅర్బన్: మద్యం మత్తులో ఇద్దరు యువకులు మరో యువకుడిపై దాడి చేసిన సంఘటన కొత్తగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం .. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగుకు చెందిన ఎస్‌కె.మహబూబ్ తన స్నేహితుడు మామిడి శ్రీకాంత్‌తో కలిసి రైతుబజార్ సమీపంలోని ఓ రెస్టారెంట్ ముందు నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో మిరియాల శ్రీకాంత్, రేవంత్ అక్కడికి వచ్చి అసభ్యపదజాలంతో మాట్లాడారు. తమ వెంట తెచ్చుకున్న కర్రలతో దాడి చేయగా మహబూబ్‌కు గాయాలయ్యాయి. రక్తస్రావం అవుతుండటంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో మహబూబ్‌ను అతని మిత్రుడు మామిడి శ్రీకాంత్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాడు. అనంతరం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై సోమేశ్వర్ కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

విజేతలు ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, జీపీసీ

విజయవంతంగా ముగిసిన ఎస్‌పీఎల్ రీజినల్ టోర్నీ

- సీనియర్స్, జూనియర్స్‌లో రన్నరప్‌గా వాగ్దేవి, శ్రీచైతన్య జట్లు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు





సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన సీనియర్ సివిల్ జడ్జి జావేద్‌పాషా, సాక్షి ఉద్యోగులు, క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్ కంపెనీ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీలో భాగంగా రీజినల్ స్థాయి పోటీలు బుధవారం జరిగాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల, జూనియర్స్ విభాగంలో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్లు విజేతగా నిలిచాయి. అలాగే, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రన్నరప్‌గా వరంగల్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఖమ్మం శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు నిలిచాయి. విజేతలు, రన్నరప్ జట్లకు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జావేద్ పాషా ముఖ్యఅతిథులుగా పాల్గొని ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాక్షి ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహన్‌కృష్ణ, టీవీ. ప్రతినిధి పి.మహేందర్, యాడ్స్ మేనేజర్ ఎన్.శేషు, ఈవెంట్స్ మేనేజర్ బోడపట్ల వేణు, న్యాయ సహాయ న్యాయవాది ఇమ్మడి లక్ష్మీ నారాయణ, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి, సీనియర్ క్రికెటర్లు జోజి చాకో, ఎం.డీ.ఫారుక్, జీవని, తరుణ్‌తో పాటు సాక్షి ఉద్యోగులు నెల్లూరి ఉపేందర్, రాధారాపు రాజు, జుజ్జూరు ఉపేందర్, ఆసిఫ్, కిరణ్, రాంబాబు, శ్రీనివాసాచారి, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బౌలింగ్‌లో హ్యాట్రిక్ సాధించిన ఖమ్మం శ్రీచైతన్య కాలేజీ క్రీడాకారుడు గౌతమ్

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI · SAKSHI DIGITAL MEDIA GROUP

జూనియర్స్ విజేత వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు

ఎస్‌పీఎల్ రీజియన్ స్థాయి జూనియర్స్ విభాగం మ్యాచ్‌లో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల – ఖమ్మం శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు తలపడగా టాస్ గెలిచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. జట్టులో రుశాంక్ నాలుగు ఫోర్లతో 29, సాయి వంశీ ఆరు ఫోర్లతో 28 పరుగులు చేయగా, బౌలింగ్‌లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల క్రీడాకారుడు పర్షన్ రెండు, జయంత్, భరత్ ఒక్కో వికెట్ తీసుకున్నారు. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య జట్టు 12ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 96 పరుగులే చేయగలగడంతో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల టైటిల్ దక్కించుకుంది. కాగా, శ్రీచైతన్య జట్టు నుంచి విఘ్నేష్ 14, గౌతమ్ 12 పరుగులు చేయగా, వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు నుంచి కార్తీక్, శివకుమార్ రెండేసి వికెట్లు, రుశాంక్, సాయివంశీలు ఒక్కో వికెట్ తీసుకున్నారు. తొలుత రీజియన్ స్థాయి పోటీల్లో ఫైనల్స్‌లో స్థానం కోసం నల్లగొండ ఎన్‌సీఎల్ జూనియర్ కళాశాల, ఖమ్మం శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్ల నడుమ మ్యాచ్ జరగగా శ్రీ చైతన్య జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన ఎన్‌సీఎల్ జట్టు పది ఓవర్లలోనే 83 పరుగులే చేసి ఆలౌట్ కావడంతో శ్రీచైతన్య జట్టు విజయం సాధించినట్లయింది.





సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రన్నరప్‌గా నిలిచిన వరంగల్ వాగ్దేవి, ఖమ్మం శ్రీచైతన్య జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన సీనియర్ సివిల్ జడ్జి జావేద్‌పాషా, సాక్షి ఉద్యోగులు, క్రీడాకారులు

SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY Regional Sponser

ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్‌కు సీనియర్స్ టైటిల్

ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల – వరంగల్ వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్ల నడుమ సీనియర్స్ విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో టాస్ గెలిచిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వాగ్దేవి జట్టు 12 ఓవర్లలో 66 పరుగులు చేసి ఎనిమిది వికెట్లు కోల్పోయింది. ఈ జట్టులో సాయి నైనిత్ 14పరుగులు చేయగా, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ బౌలర్లలో అజర్ మూడు ఓవర్లు వేసి ఏడు పరుగులే ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఇక విశాల్‌యాదవ్ రెండు, సాయిచంద్ ఒక వికెట్ తీసుకున్నారు. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టు 9.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేధించి ఆరు వికెట్ల తేడాతో టైటిల్ దక్కించుకుంది. ఈజట్టులో జె.బన్ని మూడు ఫోర్లతో 25, సాయిచంద్ 17, అఖిల్ 14 పరుగులు చేశారు. ఇక వాగ్దేవి జట్టు బౌలర్లలో రియాజ్, సాయినైనిత్, పర్షన్, శ్రీధర్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలుత ఫైనల్స్‌లో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో నల్లగొండ శాంతినికేతన్ డిగ్రీ కళాశాల, వరంగల్ వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి జట్టు పరిమిత 12 ఓవర్లలో ఆరు వికెట్లకు 93 పరుగులు చేసింది. ఆతర్వాత శాంతినికేతన్ జట్టు బ్యాటింగ్‌కు దిగి 12 ఓవర్లలో 65 పరుగులే చేయడంతో వాగ్దేవి జట్టు 29 పరుగుల తేడాతో విజయం సాధించింది.



జూనియర్స్ విభాగంలో ఖమ్మం శ్రీచైతన్య - వరంగల్ పాలిటెక్నిల్ జట్ల నడుమ మ్యాచ్

క్రమశిక్షణ, పట్టుదలతో ఎదగాలి

– ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరమని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌పీఎల్ రీజినల్ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశాక మాట్లాడారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడమే కాక సమసమాజాన్ని స్థాపించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతీ మనిషిలో ఒక ప్రత్యేకత ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అదే సమయాన చెడు వ్యసనాలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని.. సాంఘిక దురాచారాలైన వరకట్నం, భ్రూణ హత్యలు, లంచాలు తీసుకోవడం, ఇవ్వడం వంటి వాటిని అరికట్టడంలో యువత పాత్ర కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కాగా, 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఇలాంటి టోర్నీలు యువతలో మార్పు తీసుకొచ్చేందుకు ఉపయోగపడతాయని జిల్లా జడ్జి పేర్కొన్నారు.

'ఆకాశవాణి'లో కిసాన్ దివస్..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రేడియో కిసాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం హెడ్ ఎస్.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, గరిమెళ్లపాడు ఉద్యాన అధికారి కె.కిరణ్‌కుమార్, అభ్యుదయ రైతు గొట్టిపాటి వెంకటేశ్వరరావు, నాయకులగూడెం రైతు మండే వీరభద్రం, సంపత్‌నగర్ రైతు గంటి దుర్గబాబు, ఇల్లెందు రైతు మోహన్‌రాజ్ నాయక్, ఆకాశవాణి రేడియో సిబ్బంది బైరి శ్రీనివాసన్, కొలిపాక శంకర్‌రావు, బొల్లవరపు ప్రసాద్, సాంకేతిక సిబ్బంది పి.ప్రభాకర్‌రావు, పి.సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన పద్ధతులు, తేనెటీగల పెంపకం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులను శాలువాలతో సత్కరించారు.



రేడియో కిసాన్ దివస్ నిర్వహిస్తున్న దృశ్యం

మహిళ అదృశ్యం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఓ మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని రిక్షా కాలనీ కి చెందిన జ్యోతి ఈ నెల 12న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె భర్త పెద్దిరాజు బుధవారం భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి పోటీలకు బోనకల్ విద్యార్థులు



సహస్ర



కీర్తి



శ్రీహర్షిణి

బోనకల్: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో జరగనున్న 41వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఎం.కీర్తి, బి.సహస్ర, పి.శ్రీహర్షిణి ఎంపికయ్యారని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్యదర్శి సురేశ్, బొంతు శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారులను అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పి.రామచంద్రరాజు, లింగయ్య బుధవారం అభినందించారు.

విద్యార్థిని ఆత్మహత్య

ములకలపల్లి : విద్యార్థిని ఆత్మహత్యపై మంగళవారం రాత్రి కేసు నమోదయింది. పోలీసుల కథనం ప్రకారం... సీతాయిగూడెం గ్రామానికి చెందిన మడివి వెంకటేష్‌కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురు మౌనిక హైదరాబాద్‌లో విద్యనభ్యసిస్తోంది. రెండో కూతురు మానస (15), చిన్నకూతురు మంజూష దమ్మపేట మండలంలోని అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నారు. ముగ్గురు సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చారు. పండుగ అనంతరం పెద్దకూతురు, చిన్న కూతురు తిరిగి విద్యాలయాలకు వెళ్లారు. పదోతరగతి చదువుతున్న రెండో కూతురు మానస మాత్రం ఇంటివద్దనే ఉంటోంది. స్కూల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు సూచిస్తున్నా వెళ్లకుండా కాలయాపన చేస్తోంది. ఈ క్రమంలో స్కూల్‌కు కచ్చితంగా వెళ్లాలని, బట్టలు సర్దుకోవాలంటూ మంగళవారం ఉదయం తండ్రి వెంకటేష్ చెప్పాడు. అనంతరం తల్లిదండ్రులు ఇద్దరూ పొలం పనులకు వెళ్లారు. కాగా మనస్తాపం చెందిన మానస పురుగుల మందు తాగింది. సమీపస్తుల సమాచారంతో వచ్చిన తల్లిదండ్రులు ఆమెను చికిత్స నిమిత్తం మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమలరావు తెలిపారు.

దమ్మపేటలో యువతి..

దమ్మపేట: ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన కనసాని శ్వేత(19)కు వివాహం అయినప్పటికీ కొంతకాలంగా భర్త నుంచి విడిగా, తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. ప్రస్తుతం భద్రాచలంలో నర్సింగ్ విద్యనభ్యసిస్తోంది. కుటుంబ ఆర్థిక సమస్యలతో రెండు నెలలుగా కళాశాలకు కూడా వెళ్లడం లేదు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 12న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తుపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం, ఆ తర్వాత హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలి తల్లి వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్సై సీమ తెలిపారు.

న్యాక్ బృందం సందర్శన

- ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశీలన
- విద్యార్థులు, అధ్యాపకులతో వేర్వేరుగా సమావేశాలు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) త్రిసభ్య బృందం బుధవారం సందర్శించింది. చెన్నై సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఎం.కృష్ణ, అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ ప్రొఫెసర్ అబ్దుల్ రహీమ్ పి.విజీపూర్, అస్సాం గోల్‌ఘాట్ ఫార్‌కేటింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అపూబా సైకియా ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. రెండు రోజుల పాటు కళాశాల స్థితిగతులను అధ్యయనం చేయనుండగా, తొలిరోజు విభాగాల వారీగా సమీక్షలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులతో కళాశాల పరిస్థితులపై సభ్యులు ఆరా తీశారు. కళాశాల నిర్వహణ, సాధించిన ప్రగతి తదితర వివరాలు తెలుసుకున్నారు. కళాశాల సమగ్ర వివరాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ డిజిటల్ ప్రెజెంటేషన్ ఇవ్వగా.. బృందం సభ్యులు కళాశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. విభాగాల అధిపతులు, అధ్యాపకులతో వేర్వేరుగా సమావేశమై విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించారు. కోర్సులు, అధ్యాపకుల బోధనతీరు, పరిశోధనా స్థాయి తదితర అంశాలపై ఆరా తీశారు.



జేడీ రాజేందర్ సింగ్, ప్రిన్సిపాల్ తదితరులతో సమావేశమైన న్యాక్ బృందం

విద్యార్థులు, పూర్వవిద్యార్థులతో సమావేశం

కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశమై వారు పొందిన ప్రగతిని, కళాశాల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపునకు అందిస్తున్న సహకారం తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో సమావేశమై సమాజం, జాతీయ నాయకులపై విద్యార్థులకు ఉన్న అవగాహనను పరీక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్య జేడీ డాక్టర్ రాజేందర్‌సింగ్, సింగరేణి జీఎం షాలేమురాజు, దిండిగాల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, జుగల్‌కిషోర్, డాక్టర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పర్రె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి రాధాకృష్ణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిపై భరోసా ఉండేలా కొత్త కోర్సులు..

ఉన్నత విద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్ రాజేందర్‌సింగ్

ఇల్లెందురూరల్: ఉపాధిపై భరోసా ఉండేలా డిగ్రీ స్థాయి నుంచి కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఉన్నత విద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్ రాజేందర్‌సింగ్ తెలిపారు. న్యాక్ బృందం సందర్శన నేపథ్యంలో కళాశాలకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో బయోటెక్నాలజీ, డేటా సోర్స్, గేమింగ్, బీబీఏ తదితర మార్కెట్‌కు అనుకూలంగా ఉండేలా కొత్త కోర్సులు ఉంటాయని పేర్కొన్నారు. మూడు రోజులు తరగతులు, మూడు రోజులు ప్రయోగాత్మక శిక్షణ ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులు స్వయం ఉపాధి, ఉద్యోగం పొందేలా స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 132 డిగ్రీ కళాశాలలు ఉండగా, ఇప్పటివరకు 90 కళాశాలల్లో న్యాక్ తనిఖీలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి కళాశాల గ్రేడ్ పెంపొందించుకొని రూసా నిధులతో మరింత అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయని వివరించారు. గడిచిన నాలుగేళ్లలో పలు నూతన కోర్సుల అమలు, కళాశాలల అభివృద్ధి, అధ్యాపక పోస్టుల భర్తీ తదితర చర్యలతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో డిగ్రీ ఫస్టియర్‌లో 50 వేల మంది విద్యార్థులు ప్రవేశం పొందారని తెలిపారు. 11 కళాశాలలు స్వయం ప్రతిపత్తి సాధించాయని పేర్కొన్నారు. ఇల్లెందు డిగ్రీ కళాశాల న్యాక్‌లో ఏ గ్రేడ్ సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

పాలకుర్తిలో రూ.25 కోట్లతో పర్యాటక హోటల్

సాక్షి, హైదరాబాద్: పాలకుర్తిలో పర్యాటక హోటల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేశారు. హోటల్ ఏర్పాటుకు పరిపాలనామోదం తెలుపుతూ.. సాధ్యమైనంత త్వరగా భవనాన్ని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 48 జారీ చేసింది. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. పాలకుర్తిలో పర్యాటక హోటల్ ఏర్పాటు చేయాలని కోరగానే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ హోటల్ నిర్మిస్తే.. ఆధ్యాత్మిక కేంద్రమైన పాలకుర్తికి వచ్చే పర్యాటకులు, భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలకు డబ్బులివ్వొద్దు



రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న అర్వింద్

ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలు చేసే కాంట్రాక్టర్లు స్థానిక ఎమ్మెల్యేలకు డబ్బులు ఇవ్వవద్దని ఎంపీ ధర్మపురి అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ శివారులోని మామిడిపల్లి – గోవింద్‌పేట్ రోడ్డులో ఇటీవల నిర్మాణం పూర్తయిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మూడు నెలలుగా దక్షిణ మధ్య రైల్వే జీఎంపై ఒత్తిడి చేసి ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించానన్నారు. త్వరలో మామిడిపల్లి నుంచి హైదరాబాద్ రూట్‌లో, అడవి మామిడిపల్లి నుంచి నిజామాబాద్ రూట్‌లో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలు కూడా పూర్తి చేయిస్తామని తెలిపారు.

ప్రత్యామ్నాయ అడవులకు ఫారెస్ట్ బ్లాక్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఫారెస్ట్ బ్లాక్‌లను రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. ప్రభుత్వపరంగా వివిధ ప్రాజెక్ట్‌లు, అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఆయా చోట్ల అటవీభూమిని మళ్లించిన నేపథ్యంలో.. ఆయా జిల్లాల్లోని రెవెన్యూ భూమిని ప్రత్యామ్నాయ అటవీ భూములుగా నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సాకారమవుతున్న స్వప్నం

- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజలో సీఎం వైఎస్ జగన్
- జిందాల్ ఆధ్వర్యంలో రూ.8,800 కోట్లతో 3 మిలియన్ టన్నుల స్టీల్ ప్లాంట్
- రూ.700 కోట్లతో నీరు, విద్యుత్, ఇతరత్రా మౌలిక వసతుల కల్పన
- జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 1.75 లక్షల ఉద్యోగాలు

సాక్షి ప్రతినిధి, కడప: 'మనందరి చిరకాల స్వప్నం సాకారమౌతోంది. వేలాది మందికి ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు మన ముంగిట్లోకి రానున్నాయి'అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పట్లో నాన్న గారు ఉన్నప్పుడు ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కలలుకన్నారని, ఇక్కడ స్టీల్ ప్లాంట్ కావాలని ఆలోచించారని చెప్పారు. ఆయన చనిపోయాక జిల్లాను ఏ నాయకుడూ పట్టించుకోనందున జిల్లా మొత్తం వెనుకబాటుకు గురవ్వడం మన కళ్లతో మనం చూశామన్నారు. దేవుడి ఆశీస్సులతో, మీ అందరి చల్లని దీవెనలతో మీ బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక.. మళ్లీ ఈ ప్రాంతానికి ఒక్కొక్కటిగా పరిశ్రమలు రావడంతో మంచి రోజులు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అగ్రగామి జిందాల్ గ్రూపు

- ఇక్కడ నిర్మించబోయే స్టీల్ ప్లాంట్ మరో 24–30 నెలల్లోపు ప్రారంభమవుతుంది. 3 మిలియన్ టన్నుల ప్లాంటును రెండు దశల్లో కట్టడానికి జిందాల్ కార్యాచరణ తయారు చేశారు. రూ.3,300 కోట్లతో మొదటి దశ పూర్తవుతుంది. ఆ తర్వాత రూ.5,500 కోట్లతో సెకండ్ ఫేజ్ మరో ఐదేళ్లలో అందుబాటులోకి వస్తుంది. మొత్తంగా రెండు దశల్లో రూ.8,800 కోట్లతో ఈ ప్రాంతంలో 3 మిలియన్ టన్నుల సామర్థ్యమున్న స్టీల్ ప్లాంట్ వేగంగా నిర్మాణం పూర్తి చేసుకోనుంది.
- జిందాల్ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ 28.5 మిలియన్‌టన్నుల స్టీల్ సామర్థ్యంతో దాదాపు రూ.1.75 లక్షల కోట్ల పెట్టుబడులతో స్టీల్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. అటువంటి వ్యక్తి మన ప్రాంతానికి వచ్చి ఇక్కడ 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. ఈ ప్లాంట్ కోసం దాదాపు 3,500 ఎకరాలు జిందాల్ ఫ్యాక్టరీకి ఇస్తున్నాం.
- ఇక్కడ జిందాల్ స్టీల్ ఫ్యాక్టరీతోపాటు పక్కన అనుబంధ పరిశ్రమల వ్యవస్థ కూడా ఏర్పడుతుంది. ఫలితంగా ఇక్కడో స్టీల్ సిటీ ఆవిర్భవిస్తుందన్న ఉద్దేశంతో గొప్పగా అడుగులు వేస్తున్నాం. మౌలిక సదుపాయాల కోసం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నాం.



వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ చేస్తున్న సీఎం వైఎస్ జగన్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్

అపారంగా ఉద్యోగావకాశాలు

- జిల్లాలో ఇప్పటికే కొప్పర్తిలో 550 ఎకరాలు కేటాయించి.. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను తీసుకొచ్చాం. ఇక్కడకు దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. ఆ 550 ఎకరాల్లో మొత్తం పరిశ్రమలు వస్తే.. మొత్తంగా లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయి.
- ఇప్పటికే అక్కడ రూ.1,100 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 11,500 మందికి ఉద్యోగాలకు సంబంధించిన కార్యాచరణ కూడా వేగంగా జరుగుతోంది. అదే కొప్పర్తిలో జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ పేరుతో 3,155 ఎకరాలను కేటాయించి.. అక్కడ రూ.18 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వచ్చే అవకాశాలు సృష్టిస్తున్నాం. తద్వారా అపారంగా.. 1.75 లక్షల ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉంది.

15 ఏళ్లకైనా 'సీతారామ' పూర్తవుతుందా?

- ధరణి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించట్లేదు
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి ధ్వజం



ఖమ్మం జిల్లా వైరాలో పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి ఏడేళ్లు గడిచినా ఇంకా ఎందుకు పూర్తి కాలేదని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. గోదావరి నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి రైతన్న కాళ్లు కడుగుతామని సీఎంతోపాటు నాయకులు చెప్పారని... ఆ రోజు ఎప్పుడొస్తుందన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానమైన రోళ్లపాడు ప్రాజెక్టుకు 2016 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 19 వేల కోట్లు కాగా గత ఏడేళ్లలో నాబార్డ్ నుంచి రూ. 6 వేల కోట్లు తెచ్చి పనులు చేశారన్నారు. ఇంత తక్కువ నిధులు కేటాయిస్తూ పోతే రాబోయే 15 ఏళ్లకైనా గోదావరి జలాలతో ప్రజల కాళ్లు కడుగుతారా అని ప్రశ్నించారు. ప్రజలు నిత్యం తన నామస్మరణ చేయాలనే తపన తప్ప.. తెలంగాణ బిడ్డల ఇబ్బందులను ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదని పరోక్షంగా విమర్శించారు.

గత 15 నెలలుగా 'ధరణి'లో సమస్యలు పరిష్కారమవక రైతులు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పొంగులేటి దుయ్యబట్టారు. కరోనా కారణంగా రుణమాఫీ చేయలేకపోయినట్లు చెబుతున్న ప్రభుత్వం రూ. వందల కోట్లు వెచ్చించి సెక్రటేరియట్ ఎందుకు నిర్మించాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఏదని తాను ప్రశ్నిస్తే తన 40 ఎకరాల మామిడి తోటకు ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు ఓ నాయకుడు చెప్పడం గర్హనీయమన్నారు. తన సొంత గ్రామంలో 40 ఎకరాల మామిడితోటే లేదన్నారు. కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులతో వైద్య, ఆరోగ్య రంగంలో అభివృద్ధి సాధించామని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో పేదలకు వైద్యం అందడం లేదని పొంగులేటి ఆరోపించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించండి

- జిల్లాల విద్యుత్ అధికారులకు ఆదేశం
- విద్యుత్, సాగునీరు వృథా అవుతోందనే భావన
- రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు



ఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ సీజీఎం జారీ చేసిన మెమో కాపీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వ్యవసాయ పంపుసెట్ల వద్ద రైతులు పెట్టుకున్న ఆటోమెటిక్ స్టార్టర్లను వెంటనే తొలగించాలని కింది స్థాయి అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు.. వెంటనే సంబంధిత జిల్లాల ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ సీజీఎం (ఆపరేషన్స్) ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు (మెమో 3817/22- 23) జారీ చేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోనూ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

అధిక ధరతో కొన్న విద్యుత్తు వృథా అవుతోందనే

వ్యవసాయ పంపు సెట్ల వద్ద ఆటోమెటిక్ స్టార్టర్లను ఉపయోగించడం వల్ల ప్రభుత్వం అధిక ధరకు కొనుగోలు చేసిన విద్యుత్ వృథా అవుతోందని, దాంతోపాటు సాగు నీరు కూడా వృథా అవుతోందని ట్రాన్స్‌కో అధికారులు భావిస్తున్నారు. దీన్ని అరికట్టేందుకే ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఇచ్చినా ఆర్వోను నియమించరా?

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ ప్రకటించినప్పటికీ ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి (ఆర్వో)ను ఎందుకు నియమించలేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి నేరాల సమాచారం తెలిపే నిబంధన ఉందో లేదో తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటర్ కార్డుతో ఆధార్ కార్డు లింక్ చేసే ప్రక్రియ అర్బన్ ప్రాంతాల్లో ఎందుకు తక్కువ అయిందో చెప్పాలన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

రాంగ్ రూట్లో వచ్చి.. బస్సును ఢీకొని..

- లారీ, బస్సు ఢీకొన్న ప్రమాదంలో కండక్టర్ మృతి
- బస్సు డ్రైవర్‌తో సహా ఎనిమిది మందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సు. (ఇన్‌సెట్‌లో) కండక్టర్ సత్తయ్య

మల్యాల(చొప్పదండి): అతివేగం.. అందులోనూ రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొట్టడంతో కండక్టర్ బొల్లం సత్తయ్య ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులోని బల్వంతాపూర్ అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఈ ప్రమా దం జరిగింది. జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్ర యాణికులతో వరంగల్ వెళ్తోంది. ఇదే సమయంలో కట్టెల లోడుతో జగిత్యాల వైపు వెళ్తున్న లారీ బల్వంతాపూర్ అడ్డరో డ్డు వద్దకు చేరుకుంది. లారీ డ్రైవర్ అతివేగంగా రాంగ్‌రూట్ లో నడపంతో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. అదే వేగంతో ముందుకు వెళ్లి తాటిచెట్టును ఢీకొని బోల్తాపడింది. లారీ ఢీకొన్న ధాటికి ఆర్టీసీ బస్సు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రా మానికి చెందిన ఆర్టీసీ బస్ కండక్టర్ బొల్లం సత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ జక్కు రాములకు తీవ్రగాయాలు కాగా, బస్సులో ఉన్న ఎనిమిది మంది ప్రమాణికులు గా యపడ్డారు. వీరిని జగిత్యాల ఏరియా ఆ స్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులకు ఆర్టీసీ డిపో మేనేజర్ సాయం అందజేశారు. ఎక్కువ గాయాలైన ఒకరికి 5వేలు, మిగిలిన ప్రయాణికులకు వెయ్యి చొప్పున అందించారు.


జీకేఓసీని సందర్శించిన సింగరేణి డైరెక్టర్లు



వ్యూపాయింట్ నుంచి ఓసీలో పరిశీలిస్తున్న డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి నెలన్నర మాత్రమే ఉన్నందున గడువు లోగా లక్ష్యసాధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్, జీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీరమేశ్‌తో పాటు అధికారులు రఘురామిరెడ్డి, ఎస్ఎస్ఆర్ మురళి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4 వేల బాతులు మృత్యువాత



మృతి చెందిన బాతులతో పెంపకందారుడు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రాళ్లవాగు సమీపాన సుమారు 4వేల బాతులు బుధవారం మృత్యువాత పడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నుంచి పలువురు వ్యక్తులు మేత కోసం మహబూబాబాద్ ప్రాంతానికి సుమారు ఏడు వేల బాతులతో వచ్చారు. రాళ్లవాగు సమీపాన తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటుండగా, సాయంత్రం బాతులు రాళ్లవాగులోకి దిగి నీరు తాగాయి. అనంతరం కాసేపటికే 4వేల వరకు బాతులు మృతి చెందాయి. సమీప పంట పొలాల్లో కలుపు మందు చల్లడం వల్ల ఆ నీరు రాళ్లవాగులో చేరడంతో బాతులు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.3లక్షల మేర విలువైన బాతులు మృతి చెందినందున తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

జిల్లా వార్తలు

'నవమి' పనులకు టెండర్లు



విగ్రహాలను ఆవిష్కరించి పూజలు చేస్తున్న ఈఓ శివాజీ

- రూ.1.35 కోట్లతో ప్రణాళిక
- టెండర్లు ఆహ్వానించిన ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మార్చి 30న శ్రీరామనవమి, 31న స్వామివారికి పట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు రూ.1.35కోట్లు కేటాయించగా, పనుల నిర్వహణకు టెండర్ల వ్యవహారాన్ని బుధవారం ప్రారంభించారు. కల్యాణ మండపం సెక్టార్లు, క్యూలైన్ల పెయింటింగ్‌కు రూ.10 లక్షలు, విస్తా కాంప్లెక్స్, స్నానఘాట్‌లు, గోదావరి ఘాట్‌ల వద్ద తాత్కాలిక షెడ్‌ల నిర్మాణానికి రూ.20 లక్షలు, తాత్కాలిక వసతి గదులు, బట్టలు మార్చుకునే గదులకు రూ.8లక్షలు కేటాయించనున్నారు. గోదావరి ఘాట్, పర్ణశాల, కల్యాణ మండపం, ప్రధాన ఆలయం వద్ద చలువ పందిళ్లకు రూ.18 లక్షలు, ఎల్ఈడీ స్క్రీన్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.10లక్షలు, ఏసీల ఏర్పాటుకు రూ.9లక్షలు, కల్యాణ మండపం, పర్ణశాల విగ్రహాల రంగులకు రూ.6లక్షలు, ఆర్చ్ గేట్లకు రూ.8లక్షలతో పాటు ఇతర పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఐదు రోజుల తర్వాత టెండర్లను ఈఓ, ఇంజనీరింగ్ అధికారులు ఖరారు చేయనున్నారు. ఆ వెంటనే పనులు ప్రారంభించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

శివాలయంలో దేవతా విగ్రహాల ఆవిష్కరణ..

దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ ఉమామహేశ్వరాలయంలో దాతల విరాళాలతో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర సమేత శివ పార్వతుల విగ్రహాలను ఈఓ శివాజీ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. సుమారు రూ.2 లక్షల వ్యయంతో వీటిని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఈఈ రవీందర్, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వైదిక కమిటీలో రెండో ప్రధానార్చకుడికి స్థానంపై చర్చలు.. ?

ప్రస్తుతం కొనసాగుతున్న వైదిక కమిటీలో రెండో ప్రధాన అర్చకుడికి సైతం చోటు కల్పించాలని గత కొద్ది కాలంగా ఓ వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం వైదిక కమిటీలో మరోమారు చర్చ జరిగినట్లు సమాచారం. రెండో ప్రధాన అర్చకుడికి స్థానం కల్పించాలని ఒక వర్గం, చోటు ససేమిరా అని మరో వర్గం అంటున్నట్లు తెలుస్తోంది. దీంతో అర్చకులు, పండితుల నడుమ ఈ వివాదం తారాస్థాయికి చేరుకుంది.

నేడు ఈఓ బాధ్యతల స్వీకరణ..

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నూతన ఈఓగా ఎల్.రమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఈఓ శివాజీని రెవెన్యూ శాఖకు పంపిస్తున్నారు. హైదరాబాద్‌లోని ల్యాండ్ విభాగంలో పనిచేస్తున్న రమాదేవికి ఆలయ ఈఓగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలో రమాదేవి నేడు స్వామివారిని దర్శించుకుని, ఆ తర్వాత బాధ్యతలు చేపట్టనున్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- వైభవంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



ఎడ్లబండ్లపై ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, గిరిజనులు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, గిరిజనులు

మహబూబాబాద్ రూరల్: బంజారాల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడిచి ఆదర్శంగా నిలవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సూచించారు. సేవాలాల్ జయంతి వేడుకలను బుధవారం మహబూబాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయ సెంటర్ నుంచి అనంతారం సేవాలాల్ గుడి వరకు ఎడ్లబండ్లపై ర్యాలీగా వెళ్లారు.

అక్కడ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజనులు సేవాలాల్ మహరాజ్ సన్నిధిలో భోగ్ భండారో సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చి న చైతన్యమూర్తి సంత్ సేవాలాల్ మహరాజ్ అని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సీతామహాలక్ష్మి, ఎంపీపీలు మౌనిక, సుజాత, మాధవి, జెడ్పీటీసీలు ప్రియాంక, శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ కొమురయ్య, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి, తహసీల్దార్లు అశోక్‌కుమార్, నాగభవాణి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



చెక్కులు అందుకున్న వారితో వెంకటేశ్వరరావు, నాయకులు

డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మంమయూరిసెంటర్: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణలో అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని.. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా గెలిపించుకుని రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధిస్తామని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎంపీ నామ నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఖమ్మం, కొత్తగూడెం, మధిర, పాలేరు, సత్తుపల్లి, వైరా, కామేపల్లి మండలాలకు చెందిన 62 మందికి రూ.24.42 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం వారు అందజేసి మాట్లాడారు. మాజీ మేయర్ డాక్టర్ పాపాలాల్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బాణాల వెంకటేశ్వర్లు, బొశబోయిన వీరన్న, వంకాయలపాటి లచ్చయ్య, చెరుకుమల్లి రవి, కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మికవర్గం, పేద ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన పోరాటయోధులను స్మరించుకుంటూనే వారి ఆశయ సాధనకు పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. సింగరేణి కాలరీస్ వ్యవస్థాపక సభ్యుడు, తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుడు దేవూరి శేషగిరిరావు వర్ధంతి, మాజీ ఎంపీ, సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని బుధవారం కొత్తగూడెం శేషగిరిభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాక సాంబశివరావు మాట్లాడారు. సింగరేణిలో సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించిన శేషగిరిరావు నాటి బ్రిటీష్ పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని, బొగ్గుగనుల్లో మహిళలు, పిల్లలతో పనిచేయించే విధానాన్ని వ్యతిరేకించిన తొలితరం ఉద్యమకారుడు శేషగిరిరావు అని గుర్తు చేశారు. ఇక విద్యార్థి దశ నుంచే తెలంగాణ పోరాటంలో పాల్గొన్న ధర్మభిక్షం ఆ తర్వాత ఎమ్మెల్యే, ఎంపీగా ప్రజలకు నిస్వార్థమైన సేవ చేశారని సాంబశివరావు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సాబీర్‌పాషా, సలిగంటి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, వట్టికొండ మల్లికార్జున్‌రావు, వంగా వెంకట్, కె.రత్నకుమారి, మోటపలుకుల రమేశ్, క్రిస్టోఫర్, మాతంగి లింగయ్య, ఉమాయిన్, సందబోయిన శ్రీనివాస్, రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ, షాహిన్, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, అక్తర్ పాల్గొన్నారు.

ఏ పార్టీ వచ్చినా కలుపుకుపోతాం: వీహెచ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హన్మంతరావు

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని ఏ పార్టీ వచ్చినా కలుపుకుపోతామని మాజీ ఎంపీ వి.హన్మంతరావు స్పష్టం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో భాగంగా పొత్తులపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పిన మాటలకు కట్టుబడి ఉన్నామని, తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆయనకు బహుమతిగా ఇస్తామని తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ విజయవంతంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో టీపీసీసీ హాథ్ సే హాథ్ యాత్ర చేపట్టిందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ యాత్రలో ప్రతీ గడపనూ తడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావిద్, నాయకులు వడ్డే నారాయణరావు, ఏలూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.